kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

గురువారం
26-03-2026

పేజీలు: 3


360° SINGLE TOPIC

మహిళా రిజర్వేషన్లు




చాలా రాజకీయ పార్టీలకు మహిళలంటే చిన్నచూపు. వాటి దృష్టిలో మహిళలు 'ఓటు బ్యాంకు' మాత్రమే. నేతలుగా గుర్తించడానికి మనసొప్పదు, ప్రోత్సహించాలన్న చిత్తశుద్ధి ఉండదు. 'ఆకాశంలో సగం' అంటూ గంభీర ఉపన్యాసాలు చేసినా టికెట్ల కేటాయింపు మొదలు నామినేటెడ్ పోస్టుల్లో, మంత్రివర్గంలో వారికి ప్రాధాన్యం అంతంతే. సన్నిహితులు, కుటుంబ సభ్యులు, వారసులకే అవకాశాలు. మెజారిటీ రాజకీయ పార్టీలది అలాంటి పురుషాధిక్య భావజాలమే. రాబోయే ఎన్నికల్లో మాత్రం 'చట్టసభల్లో 33% రిజర్వేషన్' అమలు తప్పనిసరి. పార్టీల అధినేతలకు ఇష్టమున్నా లేకపోయినా మహిళలకు టికెట్లు ఇవ్వాల్సిందే. దశాబ్దాలుగా మహిళలను అణగదొక్కిన పార్టీలే ఇప్పుడు రాజకీయంగా ఎంకరేజ్ చేసి పాపులర్ లీడర్లుగా తయారు చేసుకోక తప్పదు.. ఎన్నికల్లో టికెట్లు ఇవ్వకా తప్పదు! ఏ నియోజకవర్గం మహిళలకు రిజర్వు అవుతుందో తెలియదు. డీలిమిటేషన్ అయిన తర్వాతే క్లారిటీ. అప్పటివరకూ వెయిట్ చేయకుండా అన్ని చోట్లా మహిళా లీడర్లను తయారుచేసుకోవడమే పార్టీల ముందున్న బిగ్ ఛాలెంజ్!

'ఊపుతలేవు..', 'మంగళవారం మరదలు', 'ఆడపిల్లల్ని నా కోసం కన్నావా?..'... ఇలాంటి 'ఇన్‌డీసెంట్' వ్యాఖ్యలు చేసి అవమానించిన సీనియర్ నేతలు ఇక నుంచి మహిళలను సమాన స్థాయిలో గౌరవించక తప్పదు. ఇంతకాలం లీడర్లుగా గుర్తించడానికే నిరాకరించిన పురుష నేతలు ఇప్పుడు వైఖరి మార్చుకోవాల్సిందే. చట్టసభల్లో ఇక నుంచి మూడింట ఒకవంతుగా కనిపించే మహిళా ప్రజాప్రతినిధులపై కలం 360 డిగ్రీస్ స్పెషల్...

తెలంగాణ బ్యూరో, కలం

# మహిళా అభ్యర్థుల ఎంపిక
# పార్టీలకు ఛాలెంజ్

## 2029 ఎన్నికల నుంచే 33% ఉమెన్ రిజర్వేషన్లు!

## ఇన్నాళ్లూ వాళ్లపై పార్టీల చిన్నచూపు.. ఇకపై పట్టం కట్టాల్సిందే

## ఇప్పటి నుంచి ప్రోత్సహిస్తేనే మైలేజ్

### దశాబ్దాలుగా దక్కని ప్రాధాన్యం

స్వాతంత్ర్యం వచ్చింది మొదలు ఇప్పటి వరకు ఏ రాజకీయ పార్టీ కూడా మహిళలకు పెద్దగా ప్రాధాన్యం ఇచ్చింది లేదు. వాళ్లనొక ఓటు బ్యాంకుగా చూశాయే తప్ప.. రాజకీయంగా అవకాశాలు ఇవ్వలేదు. పైస్థాయిలోని ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పదవులు మొదలు.. కింది స్థాయిలోని జడ్పీ చైర్‌పర్సన్, మండల చైర్‌పర్సన్ పోస్టులు కూడా మహిళలకు పెద్దగా దక్కింది లేదు. టికెట్ల కేటాయింపులో పార్టీలు వివక్ష చూపుతున్నాయి. అడపాదడపా లెక్కల కోసం మాత్రం ఇచ్చామంటే ఇచ్చామనే తీరుగా.. పార్టీకి బలంలేని ఏరియాల్లోనే మహిళలను బరిలోకి దింపుతున్నాయి.

### గ్రౌండ్ ప్రిపరేషన్..


ఇప్పటి వరకు పార్టీల్లోని మహిళా విభాగాల పదవులు, ఇతర నామినేటెడ్ పోస్టులు మాత్రమే మహిళలకు ఎక్కువగా దక్కాయి. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైంది కాదు.. జాతీయ పార్టీలు మొదలు ప్రాంతీయ పార్టీల వరకు ఇదే తీరు. కానీ ఇప్పుడు రాజకీయ పార్టీలన్నీ తీరు మార్చుకునే పనిలో పడ్డాయి. మహిళా రిజర్వేషన్ల చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత, తప్పనిసరి పరిస్థితుల్లో మహిళలకు 33% సీట్లు ఇవ్వాల్సిందే. ఇందుకోసం ఇప్పటినుంచే కసరత్తు చేస్తున్నాయి. రిజర్వేషన్లు 2029 ఎన్నికల నాటికి అమల్లోకి వస్తే.. నియోజకవర్గాల్లో మహిళా లీడర్‌షిప్ తప్పదని అంచనా వేసుకుంటున్నాయి. ఇందుకోసం గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నాయి. కానీ, అన్ని పార్టీల్లో మహిళా లీడర్ల కొరత స్పష్టంగా కనిపిస్తున్నది. ఇందుకు దశాబ్దాలుగా వారిని ప్రోత్సహించకపోవడమే కారణం.




### తెలంగాణ అసెంబ్లీలో 7శాతమే

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటి వరకు మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగ్గా.. ఈ పుష్కరకాలంలో మహిళా ఎమ్మెల్యేల శాతం కేవలం ఏడు! మొత్తం 119 సీట్లలో ప్రస్తుతం ఉన్న మహిళా ఎమ్మెల్యేలు 9 మంది మాత్రమే. 2014 టర్మ్‌లో తొమ్మిది మంది మహిళలు ఎమ్మెల్యేలయ్యారు. 2018లో ఆరుగురే ఆ పదవిని దక్కించుకున్నారు. 2023 ఎన్నికల్లో పది మంది మహిళలు ఎమ్మెల్యేలుగా గెలిచారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత చనిపోవడంతో ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ విజయం సాధించారు. దీంతో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య 9కి పడిపోయింది. ఇక, కేసీఆర్ ఫస్ట్ టర్మ్ కేబినెట్‌లో అసలు మహిళలకు ప్రాతినిధ్యమే లేదు. రెండో టర్మ్‌లో ఏడాది తర్వాత అవకాశం దక్కింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇద్దరు మహిళా మంత్రులు ఉన్నారు.





## ఉమ్మడి ఏపీలో 10%లోపే పోటీ!

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనూ మహిళలకు పెద్దగా ప్రాధాన్యం దక్కలేదు. మొత్తం 294 అసెంబ్లీ సీట్లు ఉంటే.. మహిళలకు పార్టీలు టికెట్లు ఇచ్చింది తక్కువే. పోటీ చేసిన మహిళలూ అంతంతే. గెలిచిందీ తక్కువే. 1999, 2004, 2009 అసెంబ్లీ ఎన్నికలను చూస్తే మహిళా ఎమ్మెల్యేల శాతం 10 లోపే!

### 1999
1999లో జరిగిన ఉమ్మడి ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 157 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 28 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవారి శాతం 17.83.. మొత్తం 294 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 9.52.

### 2004
2004 అసెంబ్లీ ఎన్నికల్లో 161 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 26 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవారి శాతం 16.15.. మొత్తం 294 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 8.84.

### 2009
2009 అసెంబ్లీ ఎన్నికల్లో 300 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 34 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవారి శాతం 11.33. .. మొత్తం 294 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 11.56.

## 2029 నుంచే అమల్లోకి.!

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబర్‌లో చట్టం తీసుకొచ్చింది. దీన్ని నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అమల్లోకి తెస్తామని ప్రకటించింది. డీలిమిటేషన్ త్వరగా పూర్తి చేసి, 2029 సాధారణ ఎన్నికల నుంచే అమల్లోకి తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తున్నది. అప్పుడే తెలంగాణలో కూడా అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి.

- 2026లో చేపట్టే జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టాలనే నిబంధన ఉంది. జనగణనకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్రం ఇప్పటికే ప్రకటించింది. దీని ప్రకారం 2027 మార్చి 1 కల్లా జనగణన పూర్తవుతుంది. ప్రాథమిక జనాభా లెక్కల వివరాలు ప్రకటించి, ఆ వెంటనే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని కేంద్రం అనుకున్నది.
- అయితే జనాభా దామాషా ప్రకారం డీలిమిటేషన్ చేపడితే.. తమకు అన్యాయం జరుగుతుందని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పటి నుంచో ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జనాభా ప్రాతిపదికన కాకుండా.. 2011 నాటి జనాభా లెక్కల ఆధారంగానే అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతమున్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్లను సగటున 50% పెంచాలని కేంద్రం భావిస్తున్నది. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించేందుకు కసరత్తు చేస్తున్నది.



## తెలంగాణలో మహిళలకు ఎన్ని సీట్లు?

- కేంద్రం భావిస్తున్నట్టు 50 శాతం లెక్కన సీట్లు పెంచితే దేశవ్యాప్తంగా లోక్‌సభ స్థానాలు 816కు పెరుగుతాయి.
- తెలంగాణలో ప్రస్తుతమున్న లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. ఇందులో 33% అంటే 9 మహిళలకు దక్కుతాయి.
- తెలంగాణలో ప్రస్తుతం అసెంబ్లీ సీట్లు 119 ఉండగా, అవి 179కి పెరుగుతాయి. అందులో 33% అంటే 60 సీట్లు మహిళలకు దక్కుతాయి.

## తెలంగాణలో ప్రోత్సాహం కరువు!


అన్నివర్గాలకు ఫలాలు దక్కాలన్న ఉద్దేశంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మహిళలకు రాజకీయంగా ప్రాధాన్యం దక్కింది నామ్ కే వాస్తేనే! ఉమెన్ లీడర్ షిప్‌ను పార్టీలు ప్రోత్సహించిందీ లేదు!! ఇప్పటి వరకు మూడు టర్ములు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మహిళలు ఎమ్మెల్యేలు అయింది 7 శాతం లోపే!! 119 అసెంబ్లీ స్థానాల్లో ప్రస్తుతం ఉన్న మహిళా ఎమ్మెల్యేలు తొమ్మిది మంది మాత్రమే!!



### 2014
2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 127 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో గెలిచింది 9 మంది. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవాళ్ల శాతం 7.09. మొత్తం 119 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 7.56.

### 2018
2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 140 మంది పోటీ చేశారు. వీరిలో గెలిచింది ఆరుగురు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవాళ్ల శాతం 4.29. మొత్తం 119 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 5.04.

### 2023
2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నిలకల్లో 222 మంది పోటీ చేశారు. వీరిలో గెలిచింది 10 మంది. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవాళ్ల శాతం 4.50. మొత్తం 119 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 8.40.




## ఏపీలో గెలుపు అంతంతే!

ఆంధ్రప్రదేశ్ లో మొత్తం 175 అసెంబ్లీ సీట్లు ఉండగా.. మహిళల పోటీ బాగానే ఉంది. కానీ, గెలుపు విషయానికి వస్తే నామమాత్రమే. 2014, 2019, 2024 అసెంబ్లీ ఎన్నికల్లో చూస్తే ఎమ్మెల్యేలు అయిన మహిళల శాతం 10 లోపే!

### 2014
2014లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 317 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 27 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవాళ్ల శాతం 8.51.. మొత్తం 175 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 15.42.

### 2019
2019లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 193 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 14 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవారి శాతం 7.25. మొత్తం 175 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 8.0

### 2024
2024లో జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో 232 మంది మహిళలు పోటీ చేశారు. వీరిలో 22 మంది గెలిచారు. పోటీ చేసిన మహిళల్లో గెలిచినవారి శాతం 9.48. మొత్తం 175 స్థానాల్లో గెలిచిన మహిళల శాతం 12.57.

## లోక్‌సభలో 15శాతం లోపే..

**రాష్ట్రాల అసెంబ్లీల్లోనే కాదు.. లోక్‌సభలోనూ మహిళల ప్రాతినిధ్యం నామమాత్రంగానే ఉంది. 2014, 2019, 2024 లోక్ సభ ఎన్నికల్లోని గణాంకాలను గమనిస్తే.. మహిళలు ఎంపీలు అయింది 15శాతం లోపు మాత్రమే!**


### 2014
దేశవ్యాప్తంగా 668 మంది మహిళలు పోటీ చేశారు. 62 మంది మాత్రమే గెలిచారు. 525 మంది డిపాజిట్లు కోల్పోయారు. మొత్తం 543 ఎంపీ సీట్లలో మహిళలు గెలిచింది 11.41 శాతమే.

### 2019
దేశవ్యాప్తంగా 726 మంది మహిళలు బరిలోకి దిగితే.. 78 మంది గెలిచారు. 575 మంది డిపాజిట్లు కోల్పోయారు. మొత్తం 543 ఎంపీ సీట్లలో మహిళలు గెలిచింది 14.36 శాతమే.

### 2024
దేశవ్యాప్తంగా 800 మంది మహిళలు పోటీ చేస్తే.. కేవలం 74 మంది విజయం సాధించారు. 629 మంది డిపాజిట్లు కోల్పోయారు. మొత్తం ఎంపీ సీట్లలో మహిళలు గెలిచింది 13.65 శాతమే.

## ఎంపీ ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో ఇలా..!

- 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42 ఎంపీ స్థానాలకు ఎలక్షన్లు జరిగాయి. 43 మంది మహిళలు మాత్రమే పోటీ చేశారు. వీరిలో ముగ్గురే గెలిచారు. 35 మంది డిపాజిట్లు కోల్పోయారు.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో 25 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 27 మంది మహిళలు మాత్రమే పోటీ చేశారు. ఇందులో గెలిచింది నలుగురు. 20 మంది డిపాజిట్లు కోల్పోయారు. తెలంగాణలో 17 స్థానాలకు ఎలక్షన్లు జరిగాయి. ఇందులో 25 మంది మహిళలు మాత్రమే పోటీ చేయగా.. గెలిచింది ఒక్కరు మాత్రమే! 21 మంది డిపాజిట్లు కోల్పోయారు.
- 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఏపీలోని 25 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరగగా.. 38 మంది మహిళలు పోటీ చేశారు. ఇందులో గెలిచింది ముగ్గురు మాత్రమే. 31 మంది డిపాజిట్లు కోల్పోయారు. ఇదే ఎన్నికల్లో తెలంగాణలోని 17 ఎంపీ స్థానాల్లో 50 మంది పోటీ చేయగా.. అందులో గెలిచింది ఇద్దరే! 44 మంది డిపాజిట్లు కోల్పోయారు.




## మహిళా లీడర్లు కావాలి..

ఇన్ని రోజులు రాజకీయ పార్టీలన్నీ మహిళలను చిన్నచూపు చూశాయి. వాళ్లను చిన్న లీడర్లుగా, కార్యకర్తలుగానే పరిగణించాయి. ఫలితంగా ప్రతి పార్టీలోనూ మహిళా నాయకత్వలేమి ఉంది. ఇప్పడిదే పార్టీలకు సవాల్‌గా మారింది. ఉన్నపళంగా అన్ని పార్టీలు మహిళా లీడర్లను తయారు చేసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దానికి ఇంకా రెండేండ్ల టైమ్ మాత్రమే మిగిలి ఉంది. ఈలోపు ప్రతి నియోజకవర్గంలో మహిళా లీడర్లను, క్యాడర్‌ను డెవలప్ చేసుకోవాలి. ఎందుకంటే ఏ నియోజకవర్గం మహిళలకు రిజర్వ్ అవుతుందో ఇప్పడే తెలియదు. ప్రతి పార్టీ 2029 ఎన్నికల వరకు అన్ని నియోజకవర్గాల్లోనూ మహిళా లీడర్‌షిప్‌ను డెవలప్ చేసుకోవాల్సిన అవసరం తలెత్తింది.

- ప్రస్తుతం జాతీయ పార్టీలు మొదలు ప్రాంతీయ పార్టీల వరకు పేరొందిన మహిళా లీడర్లను వేళ్లపైనే లెక్క పెట్టొచ్చు.
- ఇప్పుడు ప్రతి పార్టీ అనివార్యంగా మహిళా లీడర్లను ప్రోత్సహించాలి.
- 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రతి నియోజకవర్గంలో మహిళా అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలి. వాళ్లు ఇప్పటి నుంచే ఆ నియోజకవర్గంలో యాక్టివ్‌గా తిరిగేలా చూడాలి.
- పార్టీలు ముందస్తు ప్రణాళిక లేకుండా.. అప్పటికప్పడు ఓ మహిళా అభ్యర్థిని తీసుకొచ్చి పోటీలో పెడితే ఓడిపోయే ప్రమాదం ఉంటుంది. నియోజకవర్గ ప్రజలకు పరిచయం ఉన్న మహిళలను ఎంపిక చేసుకుని, వాళ్లను ఇప్పటి నుంచే ఎంకరేజ్ చేయాల్సి ఉంటుంది.



## అమాత్యుల అడ్డాలో మహిళలే ఎక్కువ



బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కీలక నేతల నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్‌లో పురుషులతో పోలిస్తే మహిళలు 5,208 మంది, కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లలో 7,331 మంది, హరీశ్ రావు సెగ్మెంట్ సిద్దిపేటలో 4,950 మంది ఎక్కువ. సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ లో పురుషుల కంటే మహిళలు 4,761 మంది ఎక్కువగా ఉన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో 8,255, మంత్రి ఉత్తమ్ సెగ్మెంట్ హుజూర్‌నగర్ లో 7,767, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నియోజకవర్గం నల్లగొండలో 6,911 మంది మహిళలు అధికంగా ఉన్నారు . బీజేపీ నేతలు ధర్మపురి అర్వింద్, బండి సంజయ్ లోక్ సభ నియోజకవర్గాలైన నిజామాబాద్, కరీంనగర్ లోనూ మహిళా ఓటర్లే అధికం. ఇందులో మహిళా ఓటర్లను ప్రాతిపదికగా తీసుకొని మహిళలకు రిజర్వేషన్లు కలిపిస్తే.. ఈ అమాత్యుల్లో చాలా మంది ఇప్పుడున్న తమ నియోజకవర్గాలను వదులుకోవాల్సి ఉంటుంది. తమ నియోజకవర్గాలు మహిళలకు రిజర్వ్ అయితే, తాము ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఇప్పటి నుంచే పలువురు నేతలు ఆలోచిస్తున్నారు.

- ఎంఐఎం పార్టీ అసెంబ్లీ/లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటి వరకు మహిళలకు పెద్దగా టికెట్లు ఇచ్చిన దాఖలాలు లేవు. ఒకవేళ హైదరాబాద్ ఎంపీ సీటు గానీ, ఆ పార్టీకి పట్టున్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో గానీ సీట్లు మహిళలకు రిజర్వ్ అయితే మహిళలను నిలబెట్టక తప్పదు.

- తెలంగాణలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాల్లో బాల్కొండ, నిజామాబాద్ మొదటి స్థానాల్లో ఉన్నాయి.
- మహిళల ఓటర్లు తక్కువగా ఉన్న సెగ్మెంట్ల జాబితాలో పటాన్ చెరు, మేడ్చల్, కుత్బుల్లాపూర్ ఉన్నాయి.



## కవిత వ్యూహం వెనుక..!

బీఆర్ఎస్ పార్టీ నుంచి తెగతెంపులు చేసుకొని, రాజకీయ పార్టీ దిశగా అడుగులు వేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఇటీవల పలు కార్యక్రమాల్లో చేసిన కామెంట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. ఆ మాటల వెనుక మర్మంపై నేతలు వివిధ కోణాల్లో డిస్కస్ చేసుకుంటున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్, సిద్దిపేట, బోధన్, కోరుట్ల, జగిత్యాల, మంచిర్యాల, పెద్దపల్లి, మహబూబ్ నగర్... ఇలా ఎక్కడి నుంచైనా పోటీ చేస్తానంటూ కవిత సంకేతాలు ఇచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో ఉన్న మహిళా ఓటర్లను లెక్కలోకి తీసుకొని ఆమె కామెంట్లు చేసి ఉండొచ్చని, మహిళా ఓటర్లు ఉన్న నియోజకవర్గాలు మహిళా రిజర్వేషన్ల కిందికి వెళ్తాయన్న భావనలో నాయకులు ఉన్నారు. వాస్తవానికి 33 శాతం మహిళా రిజర్వేషన్ల కోసం కవిత ఆధ్వర్యంలో 2023లో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద భారీ ఆందోళన జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ స్థాయిలో వివిధ పార్టీల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. కొన్నిరోజులకు కేంద్రం మహిళా రిజర్వేషన్ల బిల్లును తీసుకురావడంతో కవిత టీమ్ సంబురాలు జరుపుకుంది. రిజర్వేషన్లు దక్కే ఏరియాలు ఏమిటి, అక్కడ ఎలా ముందుకు వెళ్లాలి.. అనే ప్రణాళికలను ఆమె సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తున్నది. డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయిన తరువాతే మహిళా రిజర్వుడు సీట్లపై క్లారిటీ రానుంది.



## రాష్ట్రంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో కొన్ని...!

| నియోజకవర్గం | మొత్తం ఓటర్లు | మహిళా ఓటర్లు | పురుషులు | మహిళా ఓటర్లు |
|---|---|---|---|---|
| నిర్మల్ | 2,60,839 | 1,37,730 | 1,23,088 | 14,642 మంది ఎక్కువ |
| బాల్కొండ | 2,29,624 | 1,23,512 | 1,06,108 | 17,404 మంది ఎక్కువ |
| నిజామాబాద్ రూరల్ | 2,60,485 | 1,38,852 | 1,21,627 | 17,225 మంది ఎక్కువ |
| ఆర్మూర్ | 2,14,136 | 1,14,473 | 99,657 | 14,816 మంది ఎక్కువ |
| బోధన్ | 2,24,772 | 1,17,768 | 1,06,999 | 10,769 మంది ఎక్కువ |
| కామారెడ్డి | 2,58,057 | 1,34,118 | 1,23,919 | 10,199 మంది ఎక్కువ |
| కోరుట్ల | 2,48,270 | 1,30,504 | 1,17,762 | 12,742 మంది ఎక్కువ |
| ఖమ్మం | 3,24,234 | 1,68,859 | 1,55,326 | 13,533 మంది ఎక్కువ |
| గజ్వేల్ | 2,85,447 | 1,45,235 | 1,40,207 | 5,208 మంది ఎక్కువ |
| జగిత్యాల | 2,39,114 | 1,24,593 | 1,14,499 | 10,094 మంది ఎక్కువ |
| నల్లగొండ | 2,51,411 | 1,29,133 | 1,22,222 | 6,911 మంది ఎక్కువ |
| సిరిసిల్ల | 2,48,334 | 1,27,829 | 1,20,498 | 7,331 మంది ఎక్కువ |
| హుజూర్ నగర్ | 2,53,110 | 1,30,430 | 1,22,663. | 7,767 మంది ఎక్కువ |
| సిద్దిపేట | 2,40,039 | 1,22,459 | 1,17,509 | 4,950 మంది ఎక్కువ |
| కొడంగల్ | 2,46,526 | 1,25,640 | 1,20,879 | 4,761 మంది ఎక్కువ |
| మధిర | 2,23,365 | 1,15,805 | 1,07,550 | 8,255 మంది ఎక్కువ |